

ఎల్లమ్మ ఆలయంలో హుండీల డబ్బును లెక్కిస్తున్న మహిళలు, అర్చక సిబ్బంది

44 రోజులకు రూ.44.83 లక్షలు

● బల్కంపేట ఎల్లమ్మ ఆలయ హుండీల ఆదాయం

అమీర్‌పేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ ఆలయ హుండీలను గురువారం లెక్కించారు. 44 రోజులకు సంబంధించి 18 హుండీల ద్వారా రూ.44,83,338 ఆదాయం వచ్చినట్లు ఈవో కృష్ణ వెల్లడించారు. జనరల్ హుండీల్లో రూ.44,24,019 రాగా అన్నదానం హుండీల్లో రూ.59,319 వేలు వచ్చాయి. దీంతో పాటు 8 యూఎస్ డాలర్లు, వచ్చాయి. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి పర్యవేక్షణలో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన లెక్కింపు సాయంత్రం 5 వరకు ముగిసింది. ఈ కార్యక్రమంలో చైర్మన్ సాయిబాబాగౌడ్, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.



జేఈఃయూ సమావేశంలో యూనియన్ నేతలు

బీఆర్‌ఎస్ అనుబంధ సంస్థ వైఫల్యం

వాటర్‌బోర్డు కార్మికులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వాటర్‌బోర్డు కార్మికుల సమస్యల పరిష్కారంలో బీఆర్‌ఎస్ అనుబంధ సంస్థ వైఫల్యం చెందిందని తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్(టీజేఈఃయూ) అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు చవ్వ సతీష్‌కుమార్, కె.రాజిరెడ్డి, రాఘవేందర్‌రాజ్, సైద్ అక్తర్‌అలీ ఆరోపించారు. టీజేఈఃయూ ఆధ్వర్యంలో గురువారం డివిజన్-3 నవోదయ కాలనీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రెండు పర్యాయాలు అధికారిక యూనియన్‌గా ఉన్నా.. కార్మికులకు చేసిందేమీలేదన్నారు. కేవలం బోర్డు ఎన్నికల్లో విజయం సాధించి తమ వ్యక్తిగత ఆస్తులు కూడబెట్టుకోవడానికే సమయం వెచ్చించారని విమర్శించారు. ఎన్నో ఏండ్లు పెండింగ్‌లో ఉన్న అక్రిడేషన్ ఫైల్ ఎండీతో చర్చించి సెక్రటేరియట్‌కు పంపించిన ఘనత మధుయాష్కీగౌడ్‌కు దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో అల్లి శ్రవణ్‌కుమార్, చంద్రశేఖర్, టీవీ.లక్ష్మణ్ కుమార్, దేవేందర్, రాజా, శ్రీనివాస్, గౌస్‌పాషా, ఆశం, శంకర్ ప్రకాష్, రాంచందర్, లక్ష్మణ్ యాదవ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్, అధికారులకు అభినందన : తలసాని

తిరుమల, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): స్వామి భక్తుడిగా తిరుమలకు ఎప్పుడు వచ్చినా పవిత్ర, మహిమ, గొప్పదనం కనిపిస్తూనే ఉంటుందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. తిరుమల శ్రీవారిని గురువారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. తన మనవళ్ల పుట్టువెంట్రుకల సమర్పణ కోసం తిరుమలకు వచ్చినట్టు తెలిపారు. తిరుమలను ఎంతో శుభ్రతగా ఉంచుతున్న దేవదాయశాఖ, టీటీడీ చైర్మన్, అధికారులు, సిబ్బందికి మనస్ఫూర్తిగా అభినందనలను తెలుపుతున్నానన్నారు.

రాడ్ లెవర్ చాలెంజ్‌కు రిషిత ఎంపిక

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాడ్ లెవర్ ఐసీ జూనియర్ చాలెంజ్ టెన్నిస్ పోటీలకు హైదరాబాద్ అమ్మాయి రిషిత రెడ్డి ఎంపికైంది. ఆసియా-ఓసియానియా రీజినల్ పోటీలకు గానూ భారత్ నుంచి మొత్తం నలుగురు ఎంపికవగా అందులో రిషితకు కూడా స్థానం లభించింది. వచ్చే ఏడాది ఈ పోటీలు జరగనున్నాయి.



రిపబ్లిక్‌డే పరేడ్-2025కి ఎంపికైన ఎన్‌సీసీ కేడెట్స్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రిపబ్లిక్ డే పరేడ్ 2025కు ఎన్‌సీసీ కేడెట్స్ ఎంపిక

పంజాగుట్ట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం దేశ రాజధానిలో జరిగే పరేడ్‌కు ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్న ఎన్‌సీసీ కేడెట్స్ హెచ్.విష్ణువర్ధన్, ఎస్.మహేష్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేంద్ర కుమార్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్‌రెడ్డి, కళాశాల ఎన్‌సీసీ అధికారి డాక్టర్ ఎన్.శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.



నిందితులతోపాటు స్వాధీనం చేసుకున్న సామాగ్రితో ఎక్సైజ్ అధికారులు

గోవాలో కొకైన్ కొని నగరంలో విక్రయం

ఇద్దరిని అరెస్ట్ చేసిన ఎక్సైజ్ అధికారులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): షార్ట్‌ఫిల్మ్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ, అదనపు ఆదాయం కోసం డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ బృందం అరెస్ట్ చేసింది. అధిక సంపాదన కోసం షార్ట్‌ఫిల్మ్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న క్రాంతి, అతడి స్నేహితుడు హజార్ కొంతకాలంగా నగరంలో డ్రగ్స్ విక్రయాలు చేస్తున్నారు. వీరు గోవా వెళ్లి అక్కడ డ్రగ్ పడ్లర్ నుంచి గ్రామ్ కొకైన్ రూ.6 వేలకు కొని, నగరానికి తీసుకొస్తున్నారు. అవసరమైన వారికి గ్రాము కొకైన్ రూ.14 వేలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వీరి దందాపై పక్కా సమాచారమందుకున్న ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ బృందాలు జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 7 వద్ద నిఘా పెట్టారు. డ్రగ్స్ విక్రయించేందుకు స్కూటీలపై వచ్చిన క్రాంతి, హజారేను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 11.5గ్రాముల కొకైన్, రెండు స్కూటీలు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఎస్‌టీఎఫ్ బృందాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి అభినందించారు.

మద్యం మత్తులో పోలీసు వాహనాన్ని ఢీకొట్టిన వ్యక్తి

బంజారాహిల్స్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మద్యంమత్తులో తన కారుతో పోలీసు వాహనాన్ని ఢీకొట్టిన వ్యక్తిపై పోలీసులు కేసు,నమోదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులు ఈ నెల 18న పెట్రోల్ వాహనంలో వెంకటగిరిలోని ఓ కేసు దర్యాప్తు నిమిత్తం వెళ్లి అక్కడ రోడ్డు పక్కనే వాహనాన్ని ఆపారు. రాత్రి సమయంలో రోడ్డు నెంబరు 10 మీదుగా వస్తున్న కియా కారు వచ్చి పెట్రోలింగ్ వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో వాహనం పూర్తిగా దెబ్బతిన్నది. అక్కడే ఉన్న పోలీసులు కియా కారులో డ్రైవింగ్ సీటులో ఉన్న చావా శ్రీధర్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని శ్వాస పరీక్ష చేయించగా 230 బీఎంఏ వచ్చింది. మద్యం తాగినట్లు నిర్ధారణ అయింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పచ్చని సిరి.. ప్రకృతి ఒడి



ఆహ్లాదం అందిస్తున్న లోటస్‌పాండ్ పార్కు

బంజారాహిల్స్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12 ఎమ్మెల్యే కాలనీలో ఉన్న లోటస్ పాండ్ పచ్చటిచెట్లతో ఆహ్లాదానికి నెలవుగా ఉంటుంది. మండు వేసవిలో కూడా ఇక్కడి వాతావరణం చల్లగా ఉంటుంది. వర్షాకాలం ముగిసిన తర్వాత ప్రకృతి అందాలు రెటింపవుతాయి. ఎంతో మంది సందర్శకులు ఇక్కడకు వచ్చి ఆస్వాదిస్తుంటారు. చుట్టూ ఖరీదైన భవంతులు వాటికి మధ్యలో అందంగా కనిపించే ఈ పార్కు బంజారాహిల్స్‌కు మరింత అందాలను తెచ్చిపెడుతుంది.

> ఎత్తైన కొండలు.. వాటిని ఆనుకొని నిర్మించబడ్డ ఇళ్లు వీటికి సరిగ్గా మధ్యలో నీటి కొలను.. చుట్టూ పచ్చటి చెట్లు.. ఎటు చూసినా ఆహ్లాదకరమైన వాతావరణమే కనిపిస్తుంది. అయితే ఇదేదో హిల్‌స్టేషన్ అనుకుంటే పొరబడినట్టే... ఇది నగరం నడిబొడ్డున ఉన్న లోటస్ పాండ్.

ఇలా ఏర్పడింది..

బంజారాహిల్స్ ఒకప్పుడు కొండ చరియల ప్రాంతం. ముఖ్యంగా ఎమ్మెల్యే కాలనీలో ప్రస్తుతం ఉన్న పార్కు ప్రాంతంలో చుట్టూ ఎత్తైన గుట్టలు ఉండేవి. వర్షం పడినప్పుడు ఆ గుట్టల మీది నుంచి వచ్చే నీటితో ఇక్కడ కొలను ఏర్పడింది. కొండలను ఆనుకొని అందమైన భవంతులు నిర్మాణం అయ్యాయి. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కొలను చుట్టూ ఓ పార్కు అభివృద్ధి చేయాలని అప్పటి పాలకులు నిర్ణయించారు. దాదాపు 30 ఎకరాల స్థలం సేకరించారు. 1999లో పార్కు పనులు మొదలయ్యాయి. 2001లో దీన్ని సందర్శకులకు కోసం అందుబాటులోకి తీసుకువచ్చారు. చలికాలం మొదలు కాగానే కొలనులో తామర పువ్వులు అధికంగా పూస్తుండటం గమనించి జీహెచ్‌ఎంసీ ఈ పార్కుకు లోటస్ పాండ్ అని నామకరణం చేసింది.



కొలనులో తామర పూలు



సేద తీరేందుకు షెడ్లు

ఎలా చేరుకోవాలంటే..

లోటస్‌పాండ్‌కు జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ మీదుగా వెళ్లవచ్చు. బస్సులో వస్తే ఎమ్మెల్యే కాలనీ వరకు వచ్చి అక్కడి నుంచి కొద్ది దూరం నడిస్తే పార్కుకు చేరుకోవచ్చు. ప్రతిరోజు ఉదయం 6నుంచి 10గంటల వరకు, సాయంత్రం 4నుంచి 6గంటల వరకు పార్కు తెరిచి ఉంటుంది. ప్రవేశ రుసుం ఉచితం. ద్విచక్ర వాహనాలు, కార్లు పార్క్ చేసుకునే వసతి ఉంది. మరింకెందుకు ఆలస్యం.. పిల్లలను తీసుకొని లోటస్ పాండ్ చూసేందుకు బయలుదేరండి ఇక..!



ప్రకృతి సోయగం

పార్కుకు వచ్చేవారికి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు ఇక్కడ సకల సదుపాయాలు కల్పించారు. పర్యావరణానికి ఏ మాత్రం ఆటంకం వాటిల్లకుండా ఉన్న సహజ వనరులను పచ్చని లోగిళ్లుగా మార్చారు. వాకర్స్ కోసం 1.2 కిటీమీటర్ల పొడువు వాకింగ్ పాత్ ఏర్పాటు చేశారు. వాకింగ్‌పాత్‌కు రెండు వైపులా పచ్చటి చెట్లు ఆహ్లాదకపరుస్తూ ఉంటాయి. అడవికి వెళ్లిన అనుభూతిని పంచుతుంది. మధ్యమధ్యలో చెక్క బ్రిడ్జిలు, కర్రలతో తయారు చేసిన షెడ్లు వంటివి పార్కుకు అదనపు అందాలను తెచ్చిపెడుతున్నాయి. వర్షపు నీటితోనే కొలను నింపుతారు. వేసవిలో కూడా నీరు అలాగే ఉంటుంది. అయితే వర్షాకాలం పూర్తయిన తరువాత పార్కు అందాలు మరింత అద్భుతంగా ఉంటాయని సందర్శకులు చెబుతున్నారు. పార్కుచివరలో గుబురు చెట్లతో చిట్టడివికి వచ్చిన అనుభూతి కలుగుతుందంటే ఆశ్చర్యపోనవసరం లేదు.

వలస పక్షుల సందడి..

సీజన్ బట్టి వలస పక్షులు పార్కుకు వస్తుంటాయి. నీటి కొలను వద్ద చెట్లపై సేద తీరుతుంటాయి. లిటిల్ గ్రెబి, కామన్ కూట్, వైట్ వాగ్‌టైల్, లిటిల్ ఎగ్రెట్, పైడ్ కింగ్‌ఫిషర్, కామన్‌మూన్‌హెన్, సన్‌బర్డ్ తదితర జాతుల పక్షులు కనువిందు చేస్తుంటాయి. అంతేకాదు వేప, కస్టర్ ఆపిల్, బాంబూ, సింగపూర్ చెర్రి, ఆస్ట్రేలియన్ తుమ్మ వంటి చెట్లు ఇక్కడ కనిపిస్తాయి. చెట్లు వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ జీహెచ్‌ఎంసీ బోర్డులను ఏర్పాటు చేసింది.

వైద్యుల పరిశోధనలు సమాజ అభివృద్ధికి దోహదం



సెమినార్‌లో మాట్లాడుతున్నస్టేట్ యునాని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వసీం అహ్మద్

ఎర్రగడ్డ, డిసెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): వైద్యుల పరిశోధనలు పురోగతి సమాజ అభివృద్ధికి తోడ్పడతాయి అని ఆయుష్ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎన్.జహీర్ అహ్మద్ అన్నారు. గురువారం ఎర్రగడ్డలోని యునాని ఆసుపత్రిలో శాస్త్రీయ రచన పరిశోధన సమగ్రత అనే అంశంపై మూడు రోజుల వర్క్ షాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యునాని విభాగంలో నాణ్యమైన పరిశోధనలు ప్రభావవంతమైన పరిశోధనలను రూపొందించడం, విద్య సంబంధ వృత్తిని అభివృద్ధి చేయడం లాంటిదని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగాస్టేట్ యునాని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వసీం అహ్మద్ మాట్లాడుతూ ఈ రంగంలోని నిపుణులకు ఈ వర్క్‌షాప్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన అధ్యాపకులు వర్క్‌షాప్ రీసెర్చ్ మెథడాలజీతో సహా ఆయుర్వేదం, యునాని, హోమియోపతి, సిద్ధాలోని పీజీవైద్య విద్యార్థులకు ఉత్తమ బోధన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఎర్రగడ్డ యునాని ఆసుపత్రి ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ యునిస్ ఇఫ్తికార్ మున్షి, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, అధ్యాపకులు జీనోద్ అబ్రాస్, నిస్వాన్, అత్వాల్ ,అజ్మల్, ఈషా అంజుమ్ పాల్గొన్నారు.

రోడ్డుపై అక్రమ పార్కింగ్ వాహనాల సీజ్

స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలను ట్రాఫిక్ పోలీసులు గురువారం సీజ్‌చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12 ఎన్‌బీటీనగర్ కమాన్ నుంచి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి నివాసం, ఏసీబీ కార్యాలయంలో రోడ్డుకు కిరువైపులా చాలకాలంగా కార్లు, ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేశారు. వీటి యజమానులు కూడా వీటిని పట్టించుకోకుండా వదిలేశారు. ఫలితంగా ట్రాఫిక్ ఆటంకాలు ఏర్పడుతున్నాయని స్థానికులు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు పశ్చిమ మండలం ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డె, ఏసీపీ కట్టా హరిప్రసాద్ క్రేన్‌ల ద్వారా వాహనాలను తొలగించి, సీజ్‌చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ చాలా మంది పార్కింగ్ వ్యవస్థ లేక వాహనాలను ఇష్టం వచ్చినట్టు రోడ్ల మీద పార్కింగ్ చేస్తున్నారని ఇలాంటి వారిపై కేసులు నమోదు చేయనున్నట్టు చెప్పారు. చాలాకాలంగా వాహనాలు పార్కింగ్‌లో ఉంటే సమాచారం ఇస్తే వాటిని తొలగిస్తామని తెలిపారు.



వాహనాలను తరలిస్తున్న ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డె, ఏసీపీ కట్టా హరిప్రసాద్

దేశాభివృద్ధికి ఆర్థిక వ్యవస్థ ప్రధానం



వేదిక పై గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, కార్డినల్ పూల ఆంథోని తదితరులు

రెజిమెంటల్‌బజార్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత దేశాభివృద్ధిలో ఆర్థిక వ్యవస్థ ప్రధానమని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. గురువారం సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ సెంటినరీ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో రెండు రోజుల జాతీయస్థాయి మేనేజ్‌మెంట్ ఫెస్ట్ ఎంప్రెసాను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. దేశంలో భిన్న మతాలు, ప్రాంతాలు, భాషలు ఉన్నప్పటికీ మనమంతా భారత దేశ పౌరులమని అన్నారు. పురోగతి సాధించడం అంటే బ్యాంకు బాలెన్స్ కాదని, మానసిక పురోగతి సాధించాలని అన్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి చెప్పినట్లు మానవులు అంతరిక్షంలోకి పోతున్నారు కానీ ఎలా జీవించాలో నేర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్చ్ బిషప్ అండ్ హైదరాబాద్ ఆర్చ్ డయోసిస్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ పూల ఆంథోనీ, హెచ్‌ఏఈఎస్ వైస్ చైర్మన్ ఎరువా బాలశౌరి, డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ ఆంథోనీ వినయ్, ఓయూ మేనేజ్ మెంట్ కాలేజ్ డీన్ ప్రొఫెసర్ శ్రీరాములు, ప్రొ.చేతన్‌శ్రీవాస్తవ, విద్యాసాగర్, మిస్సీ మాథ్యూ, మాథ్యూసి కున్నుమ్మల్ తదితరులు పాల్గొన్నారు.

'మత్స్య సహకార' ఎన్నికలు నిర్వహించండి

- హైకోర్టు ఆదేశాలను పట్టించుకోని యంత్రాంగం
- చెరువులు, కుంటల లీజును 5 శాతం పెంచొద్దు
- మత్స్య బంధు ఇవ్వాలి : డీఎఫ్‌సీఎస్ అధ్యక్షులు



మాట్లాడుతున్న హన్మకొండ జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బుస్స మల్లేశం, తదితరులు

పంజాగుట్ట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా జిల్లా మత్స్య సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని మత్స్యసహకార సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో హన్మకొండ, మేడ్చల్-మల్కాజిగిరి, వనపర్తి జిల్లాల మత్స్య సహకార సంఘం(డీఎఫ్‌సీఎస్) అధ్యక్షులు బుస్స మల్లేశం, మన్నె రాజు, పి.బాల్‌రాజ్ తదితరులు మాట్లాడారు. 33 జిల్లాలు ఉండగా 12 జిల్లాల మత్స్య సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించారన్నారు. మిగతావాటికి ఎన్నికలు నిర్వహించలేదని చెప్పారు. ఈ విషయమై తాము రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా నాలుగు వారాల్లో ఎన్నికలు నిర్వహించాలని కోర్టు ఆదేశించిందని అన్నారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు తీర్పు వచ్చి రోజులు గడుస్తున్నా అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. గత ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమం కోసం వెయ్యి కోట్ల నిధులు ఇచ్చిందని, ఈ ప్రభుత్వం మత్స్యకారులను చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. మత్స్యకారులు, మత్స్యకారుల సహకార సంఘాలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత చెరువులు, కుంటల లీజును 5 శాతం పెంచాలని చూస్తోందని, దానిని పెంచవద్దని అన్నారు. గతంలో వైఎస్‌ఆర్ సీఎంగా ఉన్నపటికీ పెంచలేదని తెలిపారు. జిల్లా మత్స్య సహకార సంఘం ఎన్నికలు సకాలంలో నిర్వహించకపోతే సహకార వ్యవస్థ కుంటుపడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉచిత చేపపిల్లల పంపిణీలో భాగంగా గత ప్రభుత్వం సుమారు 85 కోట్ల చేపపిల్లలను పంపిణీచేస్తే, ప్రస్తుత ప్రభుత్వం దానిని 50 శాతానికి తగ్గించిందన్నారు. కొన్ని జిల్లాల్లో పూర్తిగా సరఫరా నిలిపివేసిందన్నారు. దీంతో మత్స్యకారులు తీవ్రఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. రైతుబంధు ఏ విధంగా ఇచ్చారో మత్స్య బంధు ఇవ్వాలని, తమకే నిధులిస్తే తామే నాణ్యమైన చేపపిల్లలను కొనుగోలు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్ల వద్ద చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా సంఘాలకు రాష్ట్ర ఫెడరేషన్‌లో సభ్యత్వం కల్పించి, రాష్ట్ర ఫెడరేషన్ ఎన్నికలు నిర్వహించాలన్నారు. 2017 నుంచి ఇప్పటి వరకు 400 మంది మత్స్యకారులు ప్రమాదవశాత్తు మృతి చెందారని, ఒక్కో కుటుంబానికి రూ.4 లక్షల చొప్పున సుమారు రూ.16 కోట్ల ఎక్స్‌గ్రేషియాను వెంటనే విడుదలచేయాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ జిల్లా సంఘాల అధ్యక్షులు టి.గోపాల్, సోమయ్య, క్రాంతికుమార్, రమేష్, నీల రాజు, నరసయ్య, రఘు, బాలరంగం, రాంచందర్, అనిల్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న బీఎస్పీ నాయకులు

అమిత్ షా వ్యాఖ్యలపై నిరసనలు

ఖైరతాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ పై పార్లమెంటులో అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ఖైరతాబాద్ భారీ గణపతి వేదికపై దళిత నాయకులు, కాంగ్రెస్ పార్టీ నేతలు గురువారం నిరసన వ్యక్తం చేశారు. మాల సంఘం ఖైరతాబాద్ అధ్యక్షుడు బి.శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో హోంమంత్రి అమిత్ షా ఫొటోకు దండ వేసి స్వర్గలోక ప్రాప్తి రస్తు అని రాశారు. దీంతోపాటు ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శ్యామ్ మాట్లాడుతూ అంబేడ్కర్ నామస్మరణ చేయడం తప్పుగా భావించడం సరికాదన్నారు. వెంటనే షా దేశప్రజలందరికీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

వెంటనే క్షమాపణ చెప్పాలి

బంజారాహిల్స్: పార్లమెంట్‌లో అంబేడ్కర్ పట్ల వ్యంగంగా వ్యాఖ్యలు చేసిన హోంమంత్రి అమిత్‌షా వెంటనే క్షమాపణ చెప్పాలని బహుజన్ సమాజ్ పార్టీ గురువారం నిరసన ర్యాలీ నిర్వహించింది. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమిత్‌షా వ్యాఖ్యలతో బీజేపీ వైఖరి బహిర్గతం అయిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్, కో ఆర్డినేటర్ ఇబ్రమ్ శేఖర్ ఈశ్వర్, ఉపాధ్యక్షులు శ్రీరామ్ కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి శేఖర్, సికింద్రాబాద్ జిల్లా ఇన్‌చార్జి దోరపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు. ర్యాలీగా వెళుతున్న మాల వెలుగు సంఘం ప్రధానకార్యదర్శి దండు లక్ష్మణ్ తదితరులను ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేశారు.



కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజ్యసభలో అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ నేతలు ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద చేస్తున్న నిరసనలో పాల్గొన్న రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి
- యూసుఫ్‌గూడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి)



వారాసిగూడలో సీవరేజ్ పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ, జలమండలి అధికారులు

సీవరేజ్ పైప్‌లైన్ పనుల పరిశీలన

బౌద్ధనగర్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): వారాసిగూడ బ్రహ్మణబస్తీ ప్రధాన రహదారి పక్కన జరుగుతున్న సీవరేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులను గురువారం సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ, జలమండలి అధికారులు పరిశీలించారు. ఇటీవల డ్రైనేజీలు ఓవర్ ఫ్లో అవుతున్నాయని, దీంతో మురుగునీరు రోడ్లపై పారుతోందని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కార్పొరేటర్ అధికారులను సంప్రదించి డ్రైనేజీ పైప్‌లైన్ పనులను చేపట్టారు. డ్రైనేజీ ఓవర్‌ఫ్లోకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ కుషాల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

బౌద్ధనగర్, డిసెంబరు19 (ఆంధ్ర జ్యోతి): సీతాఫల్‌మండి ఇందిరానగర్ కాలనీ రోడ్డు నంబర్-4 ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభానికి మరమ్మత్తులు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్ విద్యుత్‌శాఖ అధికారులను కోరారు. రెండురోజుల క్రితం గుర్తుతెలియని వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో ఆ స్తంభం ఒక పక్కకు ఒరిగి కరెంట్ వైర్లు ప్రమాదకరంగా వ్రేలాడుతున్నాయని ఆయన విద్యుత్‌శాఖకు ఫిర్యాదు చేశారు. డీఈ బ్రహ్మానంద ఆదేశాల మేరకు ఏడీ మహేశ్, ఏఈ శ్రీకాంత్‌లు సంఘటనా స్థలానికి వచ్చి ప్రమాదానికి గురైన విద్యుత్ స్తంభాన్ని పరిశీలించారు. విద్యుత్ వైర్లును వేసి, స్తంభానికి మరమ్మత్తులు చేపడతామన్నారు. శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, కిట్టు, సత్తిరెడ్డి, బట్టల శ్రీను తదితరులున్నారు.



పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ తదితరులు

కన్నుల పండువగా అయ్యప్ప మహాపడిపూజ

బౌద్ధనగర్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం అయ్యప్పస్వామి మహాపడిపూజ కన్నుల పండువగా జరిగింది. బీఆర్ఎస్ నాయకుడు జి.చంద్రశేఖర్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజలో సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్, కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, సునీత, యువనేతలు తీగుళ్ల రామేశ్వర్ గౌడ్, త్రినేత్రగౌడ్, మాజీ కార్పొరేటర్ కందినారాయణ, కరాటేరాజు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్పస్వామి భక్తిగీతాలతో ఫంక్షన్ హాల్ పరిసరాలు మార్మోగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు.



పడిపూజలో శ్రీనివాసయాదవ్ తదితరులు

మెట్టుగూడలో...

చిలకలగూడ,డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ ఉమామహేశ్వర ఆలయంలో గురువారం డి.శ్రీనివాసయాదవ్ ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడి పూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప స్వామిని పూలు, పండ్లతో అలంకరించి 18 మెట్లకు ప్రత్యేక పూజలు చేసి కర్పూర హారతులు వెలిగించారు. భక్తి గీతాలు, కీర్తనలు అయ్యప్ప నామస్మరణతో పరిసరాలు మార్మోగాయి. గురుస్వాములు, కన్నె స్వాములు అయ్యప్ప భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

సాయి అఖండ నామ సప్తాహం ప్రారంభం



సాయి నామ పారాయణం చేస్తున్న భక్తులు

రాంగోపాల్‌పేట్, డిసెంబరు19 (ఆంధ్ర జ్యోతి): నల్లగుట్ట సాయి బాబా సమాజం ఆధ్వర్యంలో మినిస్టర్ రోడ్డు లోని కిమ్స్ ఆసుపత్రి ఎదురుగా గల గురుస్థాన్ లో సాయి అఖండ నామ సప్తాహం భక్తిశ్రద్ధల నడుమ గురువారం ప్రారంభమైంది. విజయవాడ, తెనాలి, గుంటూరు, నిర్మల్ నుంచి వచ్చిన నాలుగు భజన మండలి బృందాలచే భక్తిగీతాలతో పాటు భక్తులు సాయి నామ పారాయణంతో ఈనెల 26వ తేదీ వరకు 24 నాలుగు గంటలూ ఈ సప్తాహం కొనసానుంది. 26వ తేదీ సాయంత్రం విద్యుత్ దీపాలు, బాజా భజంత్రీల నడుమ అంగరంగ వైభవంగా సాయిబాబ పల్లకి సేవ నిర్వహించనున్నారు.

ఐటీఎఫ్ టెన్నిస్ సెమీస్‌కు రష్మిక జోడీ



రష్మిక-జిబెక్ జోడీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఐటీఎఫ్ వరల్డ్ టెన్నిస్ టూర్ డబుల్స్ విభాగంలో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక జోడీ సెమీఫైనల్స్‌లో ప్రవేశించింది. గురువారం ముంబైలో జరిగిన క్వార్టర్స్ పోరులో రష్మిక-జిబెక్ కులంబయేవా (కజకిస్థాన్) జోడీ 7-5, 6-4తో నకలో-థామచాయ్‌వట్ (థాయ్‌లాండ్) ద్వయంపై గెలిచి, సెమీస్ బెర్త్ ఖాయం చేసుకుంది. సింగిల్స్‌లో రష్మిక ప్రీక్వార్టర్స్‌లో ఓడి ఇంటిముఖం పట్టింది.



బస్తీ వాసులతో మాట్లాడుతున్న శ్యామ్ కుమార్

మౌలిక వసతుల కల్పనకు కృషి

తిరుమలగిరి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వార్డ్-7 పరిధిలోని గంగయ్య బస్తీ, తిరుమలగిరి, సెంట్రల్ బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని కంటోన్మెంట్ బోర్డు 7వ వార్డు మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్ కుమార్ అన్నారు. గురువారం కంటోన్మెంట్ బోర్డు అధికారులతో కలిసి బస్తీలలో పర్యటించారు. త్వరలోనే రోడ్డు, వీధి దీపాలకు మరమ్మత్తు లాంటి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పెద్దకమేలాలో వీధిని శుభ్ర చేశారు. కార్యక్రమంలో వార్డ్-7 బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు రుక్మయ్య, బీసీ విభాగం అధ్యక్షుడు ఉమేష్, రాజా రెడ్డి, మైనార్టీ విభాగం మహిళా అధ్యక్షురాలు శకుంతల, సెంట్రల్ బట్టీ సురేష్, హ్యారి, టోనీ పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి ఆర్థిక వ్యవస్థ ప్రధానం

● గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



వేదిక పై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఆంథోని తదితరులు

రెజిమెంటల్‌బజార్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత దేశాభివృద్ధిలో ఆర్థిక వ్యవస్థ ఒక భాగం మాత్రమే కాదని.. ప్రధానమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గురువారం సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ సెంటినరీ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో రెండు రోజుల జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ ఫెస్ట్ ఎంప్రెసాను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. దేశంలో భిన్న మతాలు, ప్రాంతాలు, భాషలు ఉన్నప్పటికీ మనమంతా భారత దేశ పౌరులమని అన్నారు. పురోగతి సాధించడం అంటే బ్యాంకు బాలెన్స్ కాదని, మానసిక పురోగతి సాధించాలని అన్నారు. అన్ని జీవులకు శిక్షణ ఇస్తే సరిపోతుందని కానీ, మానవులకు శిక్షణతో పాటు చదువు కూడా అందించాలన్నారు. చదువు అనేది కేవలం పుస్తకం నుంచి మాత్రమే కాకుండా సమాజం నుంచి నేర్చుకోవాలన్నారు. సమగ్ర విద్య అనేది కంప్యూటర్, బుక్స్ నుంచి రాదని విద్యా సంస్థలు అందించాలని అన్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి చెప్పినట్లు మానవులు అంతరిక్షంలోకి పోతున్నారు కానీ ఎలా జీవించాలో నేర్చుకోవాలని అన్నారు. చదువుకున్న వ్యక్తి ఎక్కడైనా గౌరవించబడతాడని అన్నారు. హైదరాబాద్ ఆర్చ్ బిషప్ అండ్ హైదరాబాద్ ఆర్చ్ డయోసిస్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ పూల ఆంథోనీ మాట్లాడుతూ.. తమ విద్య సంస్థల్లో పేద విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్, ఉచిత విద్య, ఫీజులో రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్ఏఈఎస్ వైస్ చైర్మన్ ఎరువా బాలశౌరి, డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ ఆంథోనీ వినయ్, ఓయూ మేనేజ్‌మెంట్ కాలేజ్ డీన్ ప్రొఫెసర్ శ్రీరాములు, ప్రొఫెసర్ చేతన్ శ్రీవాస్తవ, విద్యాసాగర్, మిస్సీ మాథ్యూ, మాథ్యూసి కున్నుమ్మల్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ వ్యవస్థ లేకపోవడమే ప్రమాదానికి కారణమా?

● చలిమంట వల్లే అగ్నిప్రమాదం జరిగిందని వ్యాపారుల అనుమానం



ప్రమాదంలో కాలిపోయిన షాపులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీ గణేశ్

రెజిమెంటల్‌బజార్,డిసెంబర్ 19(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో గురువారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదానికి మార్కెట్‌లో గతంలో మాదిరిగా రక్షణ వ్యవస్థ తీసుకోకపోవడమే కారణమని తెలుస్తోంది. ఒకప్పుడు జంట నగరాల్లోనే ప్రఖ్యాతి గాంచిన మోండా మార్కెట్ బోయిన్‌పల్లి కూరగాయల మార్కెట్ రాకతో ఆదరణ కోల్పోయింది. గతంలో 24 గంటలూ క్రయవిక్రయాలతో సందడిగా ఉంచే మోండా మార్కెట్ ప్రస్తుతం పగటిపూట మాత్రమే కొనసాగుతోంది. రాత్రి వేళల్లో మార్కెట్ మూసి ఉండటం, ఎలాంటి గేట్లు, సెక్యూరిటీ లేకపోవడంతో ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా మారిందని వ్యాపారులు వాపోతున్నారు. ఈ ప్రమాదానికి కారణం కూడా కొంతమంది చలి కాచుకోనేందుకు కొబ్బరి కాయల దుకాణం ముందు ఉన్న కొబ్బరి పీచుతో మంట వేయడంతో షాపులోకి మంటలు వ్యాపించి అగ్నిప్రమాదం జరిగినట్లు వ్యాపారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి కోల్పోయాం



బుధవారం రాత్రి 9 గంటలకు షాపు మూసి వేసి వెళ్లాం. ఉదయం తెలిసిన వారు ఫోన్ చేసి షాపునకు మంటలు అంటుకున్నాయని చెప్పారు. డెబ్బై ఏళ్లగా మా తాతల నుంచి కొబ్బరికాయల దుకాణం నిర్వహిస్తున్నాం. షాపు పూర్తిగా కాలిపోవడంతో మా ఉపాధి పోయింది.

- శ్రీధర్, బాధితుడు

ఆకతాయిలకు అడ్డాగా మార్కెట్



మార్కెట్ ఆకతాయిలకు అడ్డాగా మారింది. కొంతమంది రాత్రి వేళల్లో తిష్టవేసి మద్యం తాగుతున్నారు. ఈ ప్రాంతంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్నారు కానీ.. మార్కెట్ లోపలికి రావడం లేదు. గేట్లు, సెక్యూరిటీ లేకపోవడంతో రాత్రి వేళల్లో రక్షణ లేకుండాపోతోంది.

- రవి, వ్యాపారి

తాగి గొడవ చేస్తున్న వ్యక్తికి 3 రోజుల జైలు

రాంగోపాల్‌పేట్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): నడిరోడ్డుపై తాగి గొడవ చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న ఓ వ్యక్తికి కోర్టు మూడు రోజుల జైలు శిక్ష, రూ.1050 జరిమానా విధించింది. ఇన్‌స్పెక్టర్ పరశురామ్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగుట్టకు చెందిన పాకల కృష్ణ (24) హిల్‌స్ట్రీట్ వద్ద తాగి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాడు. ఈ వ్యవహారంపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు పాకల కృష్ణపై భారతీయ న్యాయ సంహిత ప్రకారం సీపీ యాక్ట్ సెక్షన్ 70 బి కింద ఈ పెట్టీ కేసు నమోదు చేశారు. కాగా, 17వ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నిందితుడికి మూడు రోజుల జైలు శిక్ష, రూ.1050 జరిమానా విధించారు.

44 రోజులకు రూ.44.83 లక్షలు

● బల్కంపేట ఎల్లమ్మ ఆలయ ఆదాయం

అమీర్‌పేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ ఆలయ హుండీలను గురువారం లెక్కించారు. 44 రోజులకు సంబంధించి 18 హుండీల ద్వారా రూ.44,83,338లు ఆదాయం వచ్చినట్లు ఈవో కృష్ణ వెల్లడించారు. జనరల్ హుండీల్లో రూ.44,24,019లు రాగా అన్నదానం హుండీల్లో రూ.59,319 వేలు వచ్చాయి. దీంతో పాటు 8 యూఎస్ డాలర్లు వచ్చాయి. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి పర్యవేక్షణలో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన లెక్కింపు సాయంత్రం 5 వరకు ముగిసింది. ఈ కార్యక్రమంలో చైర్మన్ సాయిబాబాగౌడ్, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణస్వామి ముదిరాజ్ సేవలు చిరస్మరణీయం



కృష్ణస్వామి ముదిరాజ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంక్షేమ సంఘం నాయకులు



కృష్ణస్వామి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బండ ప్రకాష్, పిట్ల నాగేష్ తదితరులు

బౌద్ధనగర్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర తొలి మేయర్ కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ సేవలు చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు. సికింద్రాబాద్ ముదిరాజ్ సంక్షేమ సంఘం చైర్మన్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి సతీష్‌రాజ్ ఆధ్వర్యంలో గురువారం వారాసిగూడ ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద కృష్ణస్వామి ముదిరాజ్ వర్ధంతిని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ, బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి ముఖ్యఅతిథులుగా పాల్గొని కృష్ణస్వామిముదిరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హైదరాబాద్ మహానగరానికి కృష్ణస్వామి మాస్టర్‌ప్లాన్ రూపకల్పన చేశారని, నగర ప్రజలు ఆయన సేవలను ఎప్పటికీ మరిచిపోరని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నగేష్, గణేశ్, అశోక్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణస్వామి అడుగుజాడల్లో నడవాలి

మారేడుపల్లి, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మొదటి మేయర్ కొర్వి కృష్ణస్వామి వర్ధంతిని సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండ్ వద్ద గురువారం నిర్వహించారు. కొర్వి కృష్ణస్వామి సేవా సమితి అధ్యక్షుడు పిట్ల నాగేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు కృష్ణస్వామి విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ మాట్లాడుతూ, హైదరాబాద్ విశ్వనగరంగా అభివృద్ధి చెందేందుకు కృష్ణస్వామి బాటలు వేశారని అన్నారు. ఆయన అడుగుజాడల్లో యువత నడవాలని పులుపునిచ్చారు. పిట్ల నాగేష్ మాట్లాడుతూ.... కృష్ణస్వామి నగర అభివృద్ధికి చేసిన సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్,అశోక్, సత్యం, లక్ష్మణ్, శ్రీనివాస్, వీరమని, యాదగిరి, సైదులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు వినికిడి యంత్రం అందజేసిన దాతలతో ఎంవీఎఫ్ ప్రతినిధులు

చిన్నతనంలోనే వినికిడి లోపాన్ని గుర్తించాలి

పద్మారావునగర్,డిసెంబర్,19,(ఆంధ్రజ్యోతి): పసితనంలోనే చిన్నారులలో వినికిడి లోపాన్ని గుర్తించి తగిన చికిత్స అందిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని మీనాక్షి వెంకటరామన్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ సేతురామన్ అన్నారు. పద్మారావునగర్ ఎంవీఎఫ్ కేంద్రంలో గురువారం రోటరీ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో రెండేళ్ల వయస్సు గల ఇద్దరు చిన్నారులకు డిజిటల్ వినికిడి యంత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రోటరీ క్లబ్ 3150 డిస్ట్రిక్ గవర్నర్ శరత్ చౌదరి మాట్లాడుతూ, దేశ జనాభాలో రెండు శాతం చిన్నపిల్లలు, యాభై శాతం వృద్ధుల్లో వినికిడి సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఎంవీఎఫ్ అలాంటి చిన్నారులను గుర్తించి చేయూత అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సహాయ గవర్నర్ బిబో శ్రీనివాస్, రమణి, క్లబ్ డైరెక్టర్లు డాక్టర్ రంగనాథన్, ప్రసాదరావు, మురళీ నటరాజ్ పాల్గొన్నారు.

మహిళా విశ్వవిద్యాలయానికి 100 ఎకరాలు కేటాయించాలి

● టీఎంవీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రోజా



అడ్డగుట్ట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయానికి 100 ఎకరాలు భూమితో పాటు గత బడ్జెట్‌లో ప్రకటించిన రూ 100 కోట్ల నిధులను విడుదల చేయాలని తెలంగాణ మహిళా విద్యావంతుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగపురి రోజా ప్రభుత్వాన్ని ఓ ప్రకటనలో కోరారు. యూనివర్సిటీ చాన్సలర్‌గా సీఎం రేవంత్‌రెడ్డి బాధ్య తలు స్వీకరించడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. చాన్సలర్ గా సీఎం ఉన్నందును విశ్వవిద్యాలయాన్ని తొందరగా అభి వృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం 40 ఎకరాల్లో మాత్రమే యూనివర్సిటీ కొనసాగుతోందని, యూజీసీ నిబంధ నల ప్రకారం ఈ స్థలం సరిపోదన్నారు. క్రీడా మైదా నాలు స్విమ్మింగ్‌పూల్, ఆడిటోరియం, గార్డెన్లు, వీసీ లాడ్జ్ గెస్ట్‌హౌస్ తదితర అవసరాలకు 100 ఎకరాలు భూమి అవసరమన్నారు. ఈ విషయంపై సీఎం విద్యావంతులతో చర్చించి యూనివ ర్శిటీ కావాల్సిన 100 ఎకరాలు భూమిని కేటాయించాలన్నారు. మౌలిక వసతులన్నీ కల్పించి మహిళా యూనివర్శిటీని అభివృద్ధి చేయాలని ఆమె సీఎంను కోరారు.



మహార్యాలీలో నృత్యం చేస్తున్న రైల్వే మహిళా ఉద్యోగులు

రైల్వే కార్మికులకు అండగా ఉంటాం

● రైల్వే ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్రా

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైల్వే కార్మికులు, ఉద్యోగుల డిమాండ్ల సాధనలో రైల్వే మజ్దూర్ యూనియన్ పాత్ర అభినందనీయమని ఆల్ ఇండియా రైల్వే ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్రా తెలిపారు. ఈనెల 4,5,6 తేదీల్లో దేశవ్యాపితంగా నిర్వహించిన యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో రైల్వే మజ్దూర్ యూనియన్‌కు భారీ మెజార్టీ వచ్చి గుర్తింపు రావడంతో గురువారం సికింద్రాబాద్ రైల్వే మజ్దూర్ యూనియర్ జాతీయ కార్యాలయం నుంచి రైల్ నిలయం వరకు మహా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శివగోపాల్ మిశ్రా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైల్వే రంగంలోనే కాకుండా ఇతర కేంద్ర ప్రభుత్వ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల డిమాండ్లను సాధించేందుకు జాతీయ స్థాయిలో తాము ప్రయత్నిస్తున్నామన్నారు. రైల్వే కార్మికుల అన్ని విషయాల్లోను మజ్దూర్ యూనియన్ అండగా ఉంటుందన్నారు. రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకర్‌రావు మాట్లాడుతూ, 8వ పే కమిషన్ సాధించేందుకు ఉద్యమం చేస్తున్నామని, పార్లమెంట్‌లో కూడా రైల్వే కార్మికులు బిల్లులపై సమీక్షిస్తున్నామన్నారు. రైల్వేను ప్రైవేటీకరణ చేయాలని బీజేపీ ప్రభుత్వం చూస్తోందని, అదే అదే కనుక చేస్తే దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడతామన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్, యుగేందర్ పాల్గొన్నారు. కాగా, విజయోత్సవ ర్యాలీలో సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోనే గాక తెలుగు రాష్ట్రాల రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు వందల మంది పాల్గొన్నారు. ర్యాలీలో మహిళా ఉద్యోగులు ధూమ్ ధామ్ లో డాన్స్ చేసి అబ్బురపరిచారు.

యూనియన్ నేతలతో రైల్వే జీఎం సమావేశం .

రైల్వే గుర్తింపు ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించిన ఆల్ ఇండియా రైల్వే ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్రా, యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావుతో పాటు యూనియన్ ముఖ్యనేతలతో సికింద్రాబాద్ రైల్ నిలయంలో రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ గెలుపొందడంపై జీఎం హర్షం వ్యక్తం చేశారు

'బోర్డు'కు రూ. 40 కోట్ల బకాయిలు రాబట్టాం

● సివిలియన్ నామినేటెడ్ మెంబర్ జె.రామకృష్ణ



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న రామకృష్ణ

మారేడుపల్లి, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డుకు టీపీటీ రూపంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావల్సిన 40 కోట్ల రూపాయల బకాయిలను కోర్టు ద్వారా రాబట్టామని కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ మెంబర్ జె.రామకృష్ణ తెలిపారు. కోర్టు తీర్పు వెలువడిన నేపథ్యంలో గురువారం మహేంద్ర హిల్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు 100 కోట్ల రూపాయలు బకాయి పడితే రాష్ట్ర ప్రభుత్వంపై కేసు వేసి దాదాపు 80 కోట్లు రాబట్టామన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్ బోర్డుకు ఇవ్వాల్సిన బకాయి 40 కోట్ల రూపాయలు ఇవ్వకపోతే బీజేపీ తరఫున హైకోర్టులో కేసు వేశామన్నారు. బోర్డుకు ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ ధర్మాసనం తీర్పు ఇచ్చిందన్నారు. 40 కోట్ల రూపాయల బకాయిలను తీసుకురావడంలో బీజేపీ ఆధ్వర్యంలో చేసిన కృషి ఫలించిందన్నారు. గతంలో మల్కాజిగిరి ఎంపీగా ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి ఏమి చేయలేకపోయారని, ముఖ్యమంత్రి హోదాలో ఉండి కూడా కంటోన్మెంట్ ప్రాంత అభివృద్ధి కోసం ఇప్పటి వరకు నయా పైసా కూడా కేటాయించింది లేదని విమర్శించారు.



తుకారాంగేట్‌లో కేంద్ర హోం మంత్రి ఫొటో ఉన్న దిష్టిబొమ్మను దహనం చేస్తున్న డీబీఎఫ్ మహిళలు

అమిత్ షా రాజీనామా చేయాలి: పులి కల్పన

అడ్డగుట్ట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన డిమాండ్ చేశారు. గురువారం తుకారాంగేట్‌లోని లాలాగూడ రైల్వే స్టేషన్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద మంత్రి అమిత్‌షా ఫొటోతూ కూడిన దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సంఘం గ్రేటర్ కన్వీనర్ ఉమక్క, ఉపేందర్, ఐశ్వర్య భవాని, స్వప్న, లక్ష్మి పాల్గొన్నారు.



జబ్బార్ కాంప్లెక్స్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ నాయకుల నిరసన

పద్మారావునగర్, డిసెంబర్,19 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ నుద్దేశించి కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వాఖ్యలకు నిరసనగా బన్సీలాల్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు ఐతా చిరంజీవి ఆధ్వర్యంలో గురువారం డివిజన్ పరిధిలోని జబ్బార్ కాంప్లెక్స్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. బీజేపీ, అమిత్‌షాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దిష్టి బొమ్మను తగులబెట్టారు.నిరసన ప్రదర్శనలో డివిజన్ అధ్యక్షుడు ఎ.రమేశ్, రమేశ్‌బాబు, నస్రీన్ బేగం, అరున్, రాజు, శంకర్ తదిరులు పాల్గొన్నారు.